క్లుప్తంగా

నల్లపోచమ్మ ఆలయ నూతన కమిటీ



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసిన ఆలయ నూతన కమిటీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్–2లోని శ్రీ నల్లపోచమ్మ ఆలయ కమిటీ సమావేశమై నూతన కమిటీ సభ్యులను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడు పోలోజు భగవంతాచారి, ఉపాధ్యక్షుడు రమణాచారి, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఉప కార్యదర్శి ఈశ్వరుజు శైలేష్, కోశాధికారి బి. రవి, కమిటీ సభ్యులు మ్యాడరం ప్రముఖ చారి, రాములు గోవిందుల కిరణ్, కందుకూరి శ్రీవన్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సత్యవతి, అనురాధ, సలహాదారులు సాంబయ్య, సత్యనారాయణ, కనకాచారి, రఘువంశీను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భగవంతాచారి మాట్లాడుతూ.. కమిటీ సభ్యులందరం కలిసిమెలిసి ఆలయ అభివృద్ధికి పాటుపడతామని అన్నారు.

నేడు 'మనూ'లో 'అందరికీ విద్య'

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్ఈ అండ్‌టీ) ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా 'అందరికీ విద్య' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం జరుగుతుందని ఎస్ఈ అండ్ టీ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు.. మంగళవారం ఉదయం 11 గంటలకు క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవం కూడా జరుగుతుందన్నారు.

25 మంది విద్యార్థులు ఎంపిక

రాయదుర్గం: మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధికారులు సోమవారం సమావేశమయ్యారు.సంస్థ అధికారులు వెంకట సత్యకృష్ణ, మహేష్‌లు వీసీకి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ యూసుఫ్‌ఖాన్ పర్యవేక్షణలో కంప్యూటర్ ఆధారిత హ్యాకర్ ర్యాంక్ టెస్ట్ అసెస్‌మెంట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఎంబీఏ, ఎంకామ్, బీకామ్ విద్యార్థులు హాజరయ్యారు.ప్రతిభ చాటిన వారిలో 25 మందిని ఎంపిక చేశారు.

7న శాంతిసరోవర్‌లో కృష్ణాష్టమి

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 7వ తేదీన కృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి శాంతిసరోవర్ క్యాంపస్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఈ వేడుకలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్మాత్మిక కార్యక్రమాలు, మెడిటేషన్ వంటివి నిర్వహిస్తారు.

నియామకం



సంతోష్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న సత్యశంకర్

మూసాపేట: భరత్‌నగర్ కాలనీకి చెందిన ది ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారిగా సంతోష్‌ను నియమించారు. ఈ మేరకు ఫౌండర్, చైర్మన్ సత్య శంకర్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్, కరాటే వంటివి నేర్చుకోవాలని అన్నారు.

'ఫస్ట్ రెస్పాండర్లు' 43 మందికి శిక్షణ పూర్తి



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'ఫస్ట్ రెస్పాండర్ల'కు రెండు రోజుల శిక్షణ సోమవారం పూర్తైంది. హెచ్‌సీయూ, ఈఎంఆర్ఐ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో మొదటి విడతలో 43 మందికి శిక్షణ ఇచ్చారు. అభ్యాసకులకు మొదటిరోజు శిక్షణలో భాగంగా సాధారణ వైద్యం, గాయం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో నేర్పించారు. రెండవ రోజు టాస్కులు ఇచ్చారు. ఈఎంఆర్ఐలోని మాస్టర్ ట్రైనర్లు, ఇన్‌స్ట్రక్టర్లచే వీరికి ప్రత్యేక శిక్షణ అందించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ గీతా వేముగంటి శిక్షకులను అభినందించారు. శిక్షణలో ఈఎంఆర్ఐ–జీహెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ జీవిరమణ పర్యవేక్షణలో ప్రతినిధులు డాక్టర్లు రవీనా,జావిద్, సతీష్, శిక్షణ అందించారు.

'తొమ్మిదేళ్ల అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తోంది'

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- వర్షంలోనే పాదయాత్ర కొనసాగించిన ఎమ్మెల్యే
- తడుస్తూనే స్థానిక సమస్యలు తెలుసుకుంటూ.. అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా



అల్లాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యేకు హారతి ఇస్తూ స్వాగతం పలుకుతున్న మహిళలు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్



కాలనీలు, బస్తీల్లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని తులసినగర్, శ్రీవివేకానందనగర్, లక్ష్మీనగర్‌లలో సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను శాలువాతో సన్మానించారు. మహిళలు ఆయనకు హారతి ఇచ్చి తిలకం దిద్ది స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఈ డివిజన్‌లో 3వ రోజు స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి గల్లీ గల్లీ తిరిగారు. పెన్షన్, రేషన్ అందుతుందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... అల్లాపూర్ డివిజన్‌లో గతంలో పాలించిన పార్టీలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడ అనే విధంగా వదిలేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తొమ్మిదేళ్లలో ఎంత అభివృద్ధి చేశామో ప్రజల కళ్ల ముందు కనిపిస్తోందన్నారు.



ఎమ్మెల్యేను మళ్లీ గెలిపించుకుందాం: కార్పొరేటర్

◆ అనంతరం కార్పొరేటర్ సబిహా బేగం మాట్లాడుతూ.. ఇంత అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే కృష్ణారావుకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం అందించే విధంగా గెలిపించుకోవాలన్నారు. డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ప్రజలందరూ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చి ఎమ్మెల్యేతో మాట్లాడి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ మహిళా ప్రొఫెసర్లకు అవార్డులు



డా. టి.సత్యసావిత్రి



డా. ఎం.అజిత



డా. సీహెచ్. శిల్పాచక్ర

బాలానగర్: జేఎన్‌టీయూలో ముగ్గురు మహిళా ఆచార్యులకు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఈసీఈ డిపార్టుమెంట్‌లో ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్న డా. టి. సత్యసావిత్రి, ఫార్మసీలో ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్న డా. ఎం. అజిత, నానో సైన్స్ అండ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్న డా. సీహెచ్. శిల్పాచక్రలను ఉత్తమ అధ్యాపకులుగా ప్రకటించింది.

◆ ఈ సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. మంజూర్ హుసేన్ మాట్లాడుతూ.. ముగ్గురు ఆచార్యులకు అవార్డులు రావటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. వైస్‌చాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... అవార్డులు రావటంతో వారిపై బాధ్యతలు మరింత పెరుగుతాయన్నారు. రెక్టార్ డా. గోవర్ధన్ అవార్డు పొందిన అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు.

◆ అధ్యాపక వృత్తి చాలా పవిత్రమైందని అన్నారు. అధ్యాపకులుగా నిత్యం అనేక విషయాలు మీరు అధ్యయనం చేసి ఆ విషయాలను విద్యార్థులకు అందించటంతో అందరికన్నా ముందు వరుసలో మీరు ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. విజయకుమార్ రెడ్డి అవార్డు పొందిన వారికి అభినందనలు చెబుతూ విద్యార్థులను ఆయా రంగాల్లో బాగా ప్రోత్సాహించి యూనివర్సిటీకి, కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డి యూనివర్సిటీలో అవార్డు పొందిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం



బీఎల్‌ఓలతో సమావేశమైన ఉపకమిషనర్ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్ : ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో దరఖాస్తులు భారీగా వచ్చాయని చందానగర్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం సర్కిల్ 21 కార్యాలయంలో ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటర్ నమోదు కొరకు సుమారు 8వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలన్నారు. ఈ నెల 19 వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేస్తామని అక్టోబర్‌లో విడుదల చేసే తుది జాబితాలో నూతన ఓటర్లు, సవరణలు చేసుకున్న వాటిని కూడా పొందుపరుస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ సురేష్, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- టాస్కులు కమిషన్ల పేరుతో మోసం
- రూ.30 లక్షలు, 4.4 లక్షలు పోగొట్టుకున్న బాధితులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.30 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ మైత్రి విలాస్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్ కు మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం 30 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా అమీన్‌పూర్ పరిధిలోని సురక్ష కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 11వ తేదీన టెలిగ్రామ్ ద్వారా జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం నాలుగు లక్షల నలభైనాలుగు వేలు ఇన్వెస్ట్ చేశాడు. చివరికి తాను పెట్టినగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ రంగం బలోపేతానికి కృషి

సాక్షి సిటీబ్యూరో: వ్యవసాయ రంగానికి సేవ చేయాలనే లక్ష్యంతో అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, కంపెనీలతో సహకారం పెంచడానికి కృషి చేస్తున్నామని గ్రోవోర్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ దేవేంద్ర దాసరి తెలిపారు. రైతులకు సాధికారత కల్పించడంతో పాటు దేశంలో వ్యవసాయ పద్ధతులను విప్లవాత్మకంగా మార్చడానికి ఏర్పాటు చేసిన గ్రోవోర్ టెక్నాలజీస్ నూతన కార్పొరేట్ కార్యాలయాన్ని సోమవారం హైటెక్ సిటీ వేదికగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ నవదీప్ మెహతా మాట్లాడుతూ., వ్యవసాయ స్థిరత్వాన్ని మెరుగుపరచడం, రైతులకు ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామన్నారు. గ్రోవోర్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో కలుపు మొక్కలు, క్రిమి సంహారకాలు, శిలీంధ్రాలు తదితరాలు 140కి పైగా సాంకేతిక ఉత్పత్తులను అందిస్తుందని సేల్స్ హెడ్ పొన్నం భాస్కర్ వివరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్స్ పీజే శ్రీకాంత్, వేముల సురేష్, సేల్స్ హెడ్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు

పంజగుట్ట: బోధనలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన ఉపాధ్యాయులకు రాజా రత్న హెల్త్‌కేర్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో 8వ ఐటాప్ 2023 అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఐటాప్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వెంకట్ బార్ల తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఐటాప్ వ్యవస్థాపక సభ్యులు ఎస్.సురేష్ కుమార్, కె.రామారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత 7 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ఇస్తున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీ విద్యాబోధనలో ఉపయోగించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవార్డుకు అర్హులన్నారు. ఉపాధ్యాయులతో పాటు లెక్చరర్లు, ప్రొఫెసర్లు, క్రీడా కోచ్‌లు విభిన్న కళలను నేర్పించే కళాకారులతో పాటు, గురువులు, మెంటార్‌లూ అర్హులన్నారు. జాతీయ స్థాయిలో 24 మందికి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఒకరికి మహామహోపాధ్యాయ పురస్కారం అందిస్తామని తెలిపారు. ఈ అవార్డుకు ఈ నెల 25వ తేదీ లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏడుగురు బృందంతో కూడిన నిష్ణాత జ్యూరీ సభ్యులు నామినేషన్లు పరిశీలించి అవార్డులను ప్రకటిస్తారన్నారు. అవార్డుల ప్రదానోత్సవం హైదరాబాద్‌లో అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్స్: 89781 74444లో సంప్రదించాలన్నారు.

ప్రజావాణిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ కలిసి ప్రజల నుంచి 135 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులకు స్పష్టమైన సమాచారం అందించాలని, సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతితో సహా జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో పశు వైద్యశాల ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లో రూ.70లక్షలతో నిర్మించిన పశు వైద్యశాలను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. మొదటి అంతస్తులో వ్యాయామశాల కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి ఎక్కడా నిధుల కొరత లేకుండా పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికీ నియోజకవర్గంలో రూ.6వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నామన్నారు. ఇక్కడి పశు వైద్యశాల ఎంతో అస్తవ్యస్తంగా ఉండేదని గుర్తించి వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, సెక్రటరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో పశు వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

అక్షరాస్యతలో శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న నేపథ్యాలు కలిగిన మహిళలకు అండదండలు అందించే లక్ష్యంతో వైటుడీ ఫౌండేషన్‌తో కలిసి ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ హిందూస్తాన్ కోకోకోలా బెవరేజస్ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత అందించనున్నామని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. నగరంతో సహా దేశవ్యాప్తంగా 25వేల మందికి శిక్షణ అందించనున్నామన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ నోటిఫికేషన్ పడకేసింది. గత నెల 17న కేటగిరి–1 పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడగా కేటగిరి–2 ప్రవేశాలకు 21న ప్రకటన విడుదల కానున్నట్లు ప్రకటించారు. కానీ ఇంత వరకు కేటగిరి–2 నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. అధ్యాపకుల కొరతతో ప్రతి ఏటా పీహెచ్‌డీ ప్రవేశాల సంఖ్య తగ్గుతోంది. మాజీ వీసీ ప్రొ.తిరుపతిరావు హయాంలో నాలుగు వేల మంది విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించగా అధ్యాపకుల కొరత కారణంగా ప్రస్తుతం 400 మందికి మాత్రమే పీహెచ్‌డీ చదివే అవకాశం లభిస్తుంది.

ఐటీఐలో 11న జాబ్‌మేళా

మేడ్చల్: ఈ నెల 11న మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. జాబ్‌మేళాతో పాటు అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పలు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరవుతారని, ఐటీఐ ఉత్తీర్ణత చెందిన యువకులు ఉద్యోగావకాశాల కోసం మేళాకు హాజరు కావాలని ఆమె కోరారు.

ఉపకార వేతనాలు ఇవ్వాలి

ఏఐవైఎఫ్ జిల్లా సమితి వినతి



సాక్షి, మేడ్చల్ జిల్లా: యువతకు ఉపాధి అవకాశాల హామీలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, పోటీ పరీక్షల ద్వారా నిరుద్యోగులకు నియామక పత్రాలను కాలయాపన చేయకుండా జారీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర కోరారు. అలాగే, మేడ్చల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల బోధనా రుసుం, ఉపకార వేతన బకాయిలను యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్.హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సల్మాన్‌బేగ్, టి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఉచితంగా టెట్ నమూనా పరీక్ష

సికింద్రాబాద్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ అర్హత నమూనా పరీక్షను పరీక్ష (టెట్) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్టు సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి తెలిపారు. టెట్ వన్, టూ గ్రాంగ్ టెస్టును ఆన్‌లైన్ పద్ధతిలో ఈ నెల 7వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతిరెడ్డి కోరారు. మరింతా సమాచారం కోసం 9989913935 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భారతీయ భాషలకు సంస్కృతం తల్లిలాంటిది

ఆయాచితం నటేశ్వరరావు

సనత్‌నగర్: భారతీయ భాషలకు సంస్కృత భాష తల్లిలాంటిదని దాశరథి పురస్కార గ్రహీత, కామారెడ్డి పీవీపీ ఓరియంటల్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆయాచితం నటేశ్వరశర్మ అన్నారు. సంస్కృత భాషా వారోత్సవాల్లో భాగంగా కళాశాల సంస్కృత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సంస్కృత శ్లోకాలు, భగవద్గీత శ్లోకాల పఠనంతో పాటు సంస్కృత గీతాలాపన, నృత్యాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయా అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు.

ఓయూ ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్‌గా రఘుపతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్‌గా రఘుపతి నియమితులయ్యారు. ఓయూలో జర్నలిజం పూర్తి చేసి ఈటీవీ రిపోర్టర్‌గా పనిచేసిన రఘుపతి ఐదేళ్ల క్రితం ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా (బోధనేతర) ఈఎంఎంఆర్‌సీ ఉద్యోగంలో చేరారు. అనతి కాలంలోనే అధికారుల మన్ననలను పొందిన ఆయన ఇటీవల జరిగిన ఇంటర్వ్యూలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

ఔటా అభ్యంతరం

ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ పదవీలో సీనియర్ ప్రొఫెసర్‌ను నియమించాలని ఔటా అధ్యక్షులు ప్రొ.మనోహర్‌కు వీసీ ప్రొ.రవిందర్‌కు లేఖ రాశా రు. ఓయూలో 40 ఏళ్లగా కొనసాగుతున్న ఈఎంఎంఆర్‌సీకి ఇంత వరకు యూజీసీ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్ హోదా గల సీనియర్ అధ్యాపకులనే నియమించారని ప్రొ.మనోహర్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పీహెచ్‌డీ, యూ జీసీ నెట్, టీచింగ్ అనుభవం గల అభ్యర్థులే ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ పదవీకి అర్హులని నిబంధనలకు విరుద్ధంగా రఘుపతిని నియమించారని ఇంటర్వ్యూకు హాజరైన ఇతర అభ్యర్థులు ఆరోపించారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

- 7 తులాల ఆభరణాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ సందీప్



చైన్ స్నాచింగ్ కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్ తదితరులు

గచ్చిబౌలి: జల్సాల కోసం చైన్ స్నాచింగ్ బాటపట్టిన యువకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారని డీసీపీ సందీప్ తెలిపారు. సోమవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. వివేకానందనగర్, బోరబండకు చెందిన రెల్ల కున్నమ్మ(53) ఆగస్టు 28 సాయంత్రం 6.15 గంటల సమయంలో భర్తతో కలిసి పర్వత్‌నగర్ రోడ్డులో వాకింగ్ చేస్తోంది. వెనక నుంచి వచ్చిన ఓ యువకుడు మెడలోని మంగళసూత్రం లాక్కొని ఉడాయించాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు చిన్న కొర్పోల్, నెక్కొండ మండలం, వరంగల్‌కు చెందిన మనుగురు మహిపాల్(27)గా గుర్తించారు. 2014లో నగరానికి వలస వచ్చి తులసీనగర్, బోరబండలో నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడటంతో కూలీ డబ్బులు సరిపోక చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించగా తానే స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఏప్రిల్ 13న అల్లాపూర్ పీఎస్ పరిధిలో సజ్జా సత్యవతి నడుచుకుంటూ వెళుతుండగా పుస్తెల తాడుతో ఉడాయించినట్లు ఒప్పుకున్నాడు. ఆ రెండు కేసుల్లో 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులను డీసీపీ అభినందించారు. వాకింగ్‌కు వెళ్లినప్పుడు నగలు వేసుకోవద్దని జాగ్రత్తగా ఉండాలని డీసీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, సీసీఎస్ ఏడీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, డీఐ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.